క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగరంలోని ఎస్ఎస్–2 విద్యుత్ ఉపకేంద్రం పరిధి టౌన్–2 ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని బంగ్లా ఎదురు ముగ్గురు రోడ్డు నుంచి పాత బస్టాండ్ సెంటర్, నిడమర్రు రైల్వేగేటు వరకు, టిడ్కో గృహ సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని, కావున ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

రేపు ఆత్మకూరులో మెగా వైద్య శిబిరం

మంగళగిరి: మానవసేవా సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో డయాబెటిక్, గుండె జబ్బులు, థైరాయిడ్, కీళ్లు, ఎముకలు, చర్మ, దంత, కంటి వైద్య పరీక్షలతోపాటు ఆయుర్వేదం, ఫిజియోథెరపీ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి వైద్యుల సలహా మేరకు షుగరు, బీపీ, టుడీ ఎకో పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు, హార్మోన్ పరీక్షలు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు మందులు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుపై కంటి ఆపరేషన్లు, గుండె సంబంధిత ఆపరేషన్లు, అనుభవజ్ఞులైన డాక్టర్స్ పర్యవేక్షణలో ఉచితంగా చేస్తారని, కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో ఇరువురు చిరు వ్యాపారులు వాసా కోటేశ్వరరావు, షేక్ కరీముల్లాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో తోపుడు బండ్లు అందజేశారు. శుక్రవారం ఆటోనగర్‌లోని తన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకుల చేతుల మీదుగా తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సాలి ప్రశాంత్, వాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీరుకొండలో...

మంగళగిరి మండలం నీరుకొండ గ్రామానికి చెందిన ఇరువురు మహిళా చిరువ్యాపారులు శానం శేషమ్మ, కైలాతఈసమ్మలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో తోపుడు బండ్లు అందజేశారు. శుక్రవారం స్థానిక పార్టీ నేతలు మహిళా వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. అడిగిన వెంటనే తమకు తోపుడు బండ్లు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు వారు ధన్యవాదాలు తెలిపారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు రమణ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సయ్యద్ జానీ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో 'మా పెనుగొండ కథలు' పుస్తకాన్ని రచయిత పెనుమాక నాగేశ్వరరావు సమీక్షిస్తారని పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొనే కవులు 77 ఏళ్ల స్వాతంత్య్రం అంశాలపై కవితలు చదవాలని ఆయన కోరారు.

నేడు సినీ సంగీత విభావరి

అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

గంగానమ్మ కొలుపులు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: అరండల్‌పేట రజకుల కాలనీలోని గంగానమ్మ తల్లి కొలుపులు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.అర్చకుడు కమలాకరశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్ని ఉత్సవ నిర్వాహకులు వై.వి. సాయి రాఘవ, రజక కాలనీ అధ్యక్షుడు వై. కృష్ణ పర్యవేక్షించారు. శనివారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి పొంగళ్లు, సాయంత్రం 5 గంటలకు పల్లకీ ఊరేగింపు జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కృష్ణ కోరారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతపూజలు



విశేష అలంకారంలో వాసవీమాత



తాంబూలాలతో మహిళలు

మంగళగిరి: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే మహిళలు తల స్నానాలు ఆచరించి శ్రావణ లక్ష్మికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిళ్లలో అందమైన ముగ్గులు, గుమ్మాలకు పసుపు, కుంకుమ, మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. తమ పూజా మందిరాల్లో వరాలు ఇచ్చే వరలక్ష్మి అమ్మవారి చిత్రపటాలను, కలశాలను ఏర్పాటుచేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సుహాసినిలకు పసుపు, కుంకుమ, పూలు, తాంబూలాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. నగరంలోని పలు గృహాలు శ్రావణశోభతో కళకళలాడాయి. సాయంత్రం వేళ మహిళలు దేవాలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

ఫిరంగిపురం: మండలంలోని ఆలయాల్లో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, విజయదుర్గా ఆలయాల్లో అర్చకులు రాజేంద్రశర్మ విశేషపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో అమ్మవారికి అర్చకులు అయ్యన్నశాస్త్రి ఖడ్గమాల కుంకుమార్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. నుదురుపాడులోని పద్మావతీ అలివేలుమంగాసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి అర్చకులు విశేష స్నపన, తిరుమంజనసేవలు చేసి అష్టోత్తర, సహస్రనామాలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త, అర్చకులు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పలువురికి చోటు



ఈదులమూడి దేవిడ్‌రాజు (ఫైల్)



వడ్డేశ్వరం రజనీకాంత్ (ఫైల్)



అమరా నాగయ్య (ఫైల్)

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించిన వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా కమిటీలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురికి చోటు లభించింది. తాడేపల్లి పట్టణానికి చెందిన ఈదులమూడి డేవిడ్‌రాజును రెండోసారి కూడా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన వడ్డేశ్వరం రజనీకాంత్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగాను, తాడేపల్లి రూరల్ కుంచనపల్లికి చెందిన అమరా నాగయ్యను జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తాడేపల్లికి చెందిన మేకా వెంకటరామిరెడ్డి, మంగళగిరికి చెందిన ఎండి.ఫిరోజ్, మల్లవరపు సుధారాణిలను, తాడేపల్లి రూరల్ ఇప్పటంకు చెందిన లచ్చి తులసీగౌడ్‌ను, మంగళగిరి రూరల్‌కు బేతపూడికి చెందిన కట్టెపోగు ఉదయభాస్కర్‌లను నియమించారు. వారు మాట్లాడుతూ జిల్లా కమిటీలో తమకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంట్ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లాలో విజయకేతనం ఎగురవేసేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తామని తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరుడి 38వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు పి.ఆంజనేయశర్మ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. అనంతరం యాగశాలలో రుత్వికులు నారాయణం వంశీకృష్ణ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడి హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హోమ కార్యక్రమాలను ఆలయ అనువంశక ధర్మకర్త రేపూడి రమణారావు, భవాని, కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరెడ్డి, వై.మస్తాన్‌రెడ్డి, టి శ్రీనివాసరెడ్డి, కన్నారెడ్డి, ఫణిసందీప్, సత్యశ్రీనిజలు పర్యవేక్షించారు.

ధ్యానం చేస్తే ప్రశాంత జీవితం



విద్యార్థులకు ధ్యానం గురించి వివరిస్తున్న వ్యక్తిత్వ వికాస వక్త రాధాదేవి

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం టచ్ ద లైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మకుమారీస్ ఆశ్రమ ప్రతినిధి రాధాదేవి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ధ్యానం చేస్తే ప్రశాంతమైన జీవితంతోపాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని అన్నారు. నేటి ఒత్తిడి ప్రపంచంలో ప్రశాంతమైన జీవితం లేక అనేకమంది తీవ్రమైన వేదనకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు మాట్లాడుతూ సమయం వృథా అనుకోకుండా ప్రతి ఉదయం కొద్దినిమిషాలు ధ్యానంలో గడిపితే మనలో ఉన్న శక్తి స్థాయిలు పెరుగుతాయని అన్నారు. వర్సిటీ మానసిక నిపుణులు విజయరత్నం మాట్లాడుతూ ఉదయం లేచిన తర్వాత మనం గడిపే మొదటి పదిహేను నిమిషాలు రోజంతా మనల్ని నియంత్రిస్తాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రాడ్ బెండింగ్ కార్మికుని మృతి

మంగళగిరి: నగరంలోని ఎయిమ్స్ ఆసుపత్రి సమీపంలోని రైల్వే బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రాడ్ బెండింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి నవులూరు మక్కేవారిపేటకు చెందిన చిలకలపూడి బాబూరావు–మార్తమ్మ దంపతుల కుమారుడు చిలకలపూడి శేషగిరి (28) రాడ్ బెండింగ్ పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల కిందట బేబీ అనే మహిళతో వివాహం కాగా ఇంకా సంతానం కలుగలేదు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన మేస్త్రి రవిబాబు ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి మంగళగిరికి బయలుదేరారు. మార్గంమధ్యలోని ఎయిమ్స్ ఆసుపత్రి రైల్వే బ్రిడ్జి సమీపంలోకి చేరుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. ద్విచక్రవాహనం వెనుక వైపు కూర్చున్న శేషగిరి, ద్విచక్ర వాహనం నడుపుతున్న రవిబాబులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి వస్తున్న లారీ శేషగిరిపై ఎక్కడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందగా రవిబాబుకు స్వల్పగాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరం



పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎస్తేరురాణి, ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని డాక్టర్ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా 104 వాహన సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. 54మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఫిరంగిపురం సెక్టార్ వైద్యురాలు ఎస్తేరురాణి మాట్లాడుతూ వర్షాకాలంలో తగినంత వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాల్లో మురుగు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఇంటిలో ఉండి వైద్యశాలకు రాలేనివారి ఇళ్ల వద్దకు వెళ్లి బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి తగు సూచనలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు, హెచ్‌బీ పరీక్షలు చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంతోనిరాణి, మేల్‌హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, జోజమ్మ, శాంతరాణి, శాంతకుమారిలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సెక్షన్‌లో అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు విధుల్లో చేరడంతో వారికి వార్డులు కేటాయించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలు, డీఈఈలకు వార్డుల వారీగా వర్క్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్లకు కేటాయించిన ఇంజినీరింగ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆమె ఆదేశించారు.

లోకేష్, చంద్రబాబులపై చర్యలు తీసుకోవాలి



మంగళగిరి రూరల్ ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు



తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్లు

పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా

మంగళగిరి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న టీడీపీ నాయకులు నారా లోకేష్‌తోపాటు నారా చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడులపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి శుక్రవారం మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఇటీవల పాదయాత్రలో నారా లోకేష్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకూ ఏ కార్యకర్తపై ఎక్కువ కేసులు ఉంటాయో వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా హామీలు ఇచ్చి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులు వ్యాసం అజయ్‌కుమార్, చిన్ని సీఎం, షేక్ గౌస్, సయ్యద్ గౌస్, రుద్రు వినయ్, హర్ష, బి ఇంద్రసేనారెడ్డి, కొల్లి శేషిరెడ్డి, బియ్యపు శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న లోకేష్

తాడికొండ: రెచ్చగొట్టే ప్రసంగాలతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న లోకేష్, చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పుంగనూరు నియోజకవర్గం తంబళ్లపల్లె, మాచర్ల లాంటి ప్రశాంత నియోజకవర్గాల్లో గొడవలు సృష్టిస్తున్నారని, ఈ ఘటనలను దృష్టిలో ఉంచుకొని బాబు, లోకేష్, అచ్చెన్నాయుడులపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారిలో సోషల్ మీడియా గుంటూరు జిల్లా కో కన్వీనర్ నల్లూరి జ్యోతి, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ సీతారాం, తుళ్ళూరు మండల కో కన్వీనర్లు ఐనవోలు సుధీర్, గద్దర్ చెన్నకేశవ, కోటేశరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

నెహ్రూనగర్: ప్రజాప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం తన చాంబర్‌లో కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరినందున శుక్రవారం కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

బీపీ మండల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

మంగళగిరి: బీసీల పితామహుడు, బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధనకై తన జీవితాంతం పోరాడిన అభ్యుదయ వాది బీపీ మండల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం బీపీ మండల్ 105వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహేష్ మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం కృషి చేసిన బీపీ మండల్‌కు బీసీలందరూ జీవితాంతం రుణపడి ఉండాలన్నారు. ఇప్పటికైనా జాతీయ పార్టీలు బీసీలపై కపటప్రేమ మాని బీసీల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉడతా శ్రీనివాస్, తిరువీధుల కిరణ్, మంద్రు సత్యనారాయణ, అవ్వారు సుబ్బారావు, బిట్రా ఈశ్వరి, కనగాల వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యర్రబాలెంలో...

కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం పారిశ్రామికవాడలోని యువజన కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఆలా శివాజీ ఆధ్వర్యంలో శుక్రవారం బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దానబోయిన సుందరరావుయాదవ్, నాయకులు పొట్లూరి బెనర్జీ, ఆలా వెంకట నారాయణ, నల్లబోతుల లక్ష్మయ్య, చొప్పవరపు గోపి, తాడిబోయిన చైతన్య, కూరాకుల సాయికృష్ణ, ఆలా శ్రీను, మొద్దుల రాజా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టంలో అగ్ని ప్రమాదం

- ఒక ఆవుకు, ఒక గేదెకు తీవ్ర గాయాలు
- ఒక దూడ మృతి
- రెండు దూడలకు తీవ్ర గాయాలు
- రెండు లక్షల ఆస్తి నష్టం



కాలిపోయి మృతి చెందిన దూడ



శరీరం కాలి తీవ్రంగా గాయపడిన ఆవు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు కృష్ణానది ఒడ్డున ప్రమాదవశాత్తూ ఓ పశువుల కొట్టానికి శుక్రవారం తెల్లవారుజామున నిప్పు అంటుకోవడంతో ఒక దూడ మృతి చెందగా, ఒక ఆవు దూడకు, చూడు మోసిన గేదెకు, మరో రెండు గేదె దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. చిర్రావూరుకు చెందిన మొండితోక తంబి, అతని భార్య సుభాషిణి గేదెలను పెంచుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిర్రావూరులోని లంక భూముల్లో ఆ గేదెలను మేపి సాయంత్రం పూట బయటకు తోలుకు వచ్చి కృష్ణానది ఒడ్డున ఉన్న పశువుల కొట్టంలో వాటిని కట్టివేస్తుంటారు. గురువారం సాయంత్రం తంబి అదే విధంగా లంక భూముల నుంచి తోలుకు వచ్చిన పశువులకు కొట్టంలో కట్టివేసి పశువులకు దోమలు కుట్టకుండా మొక్కజొన్న కండెలతో పొగవేశాడు. దాంతో పాటు పశువుల కొట్టంలోకి దోమలు రాకుండా చుట్టూ దోమతెర కట్టారు. రాత్రి సమయంలో ఈదురు గాలులు రావడంతో ఆ దోమతెర పొగవేసిన బెండుముక్కలపై పడడంతో దోమతెరకు నిప్పు అంటుకుని తాటాకుల పాక అంటుకుంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పాక పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రెండు సంవత్సరాల గేదె దూడ మంటల్లో కాలి మృతి చెందగా, ఆవుకు, ఆవు దూడకు, తొమ్మి నెలలు చూడు మోసిన గేదెకు, ఏడాదిన్నర ఉన్న రెండు దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. తెల్లవారుజామున పంట పొలాలకు వెళ్లేవారు గమనించి నిప్పుల్లో ఉన్న ఆ పశువులను ఊడదీశారు. అప్పటికే కాలికి, ఒంటిపై గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న తాడేపల్లి పశువైద్యులు సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన పశువులకు వైద్యం చేశారు. తొమ్మిది నెలలు చూడుమోసిన గేదె పరిస్థితి విషయంగా ఉందని, రెండు రోజులు సమయం గడిస్తే తప్ప చెప్పలేమని ఆయన తెలిపారు. జీవనాధారమైన పశువులు అగ్ని ప్రమాదానికి గురికావడంతో తంబి, సుభాషిణి జీవనాధారం కోల్పోయామంటూ తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ప్రజాసేవలో నిజమైన సంతృప్తి

పాములపాడులో 32 మందికి బియ్యం, దుస్తులు పంపిణీ



పాములపాడులో బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివరామకృష్ణ, బెజ్జం సాయిప్రసాద్

పాములపాడు(తాడికొండ): పేదల కోసం చేసే ప్రజాసేవలో నిజమైన సంతృప్తి ఉంటుందని పాములపాడు గ్రామ సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ అన్నారు. గురువారం గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులు, వలంటీర్లు, ఆశాలకు బియ్యం పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం తరుపున ప్రజలకు నిత్యం సేవలందించే ఆశలు, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు గుర్తించిన బెజ్జం సాయిప్రసాద్ మండలంలో వందలాది మందికి బియ్యం, దుస్తులు పంపిణీకి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అతనిని ఆదర్శంగా తీసుకొని మరికొంత మంది దాతలు ముందుకు రావాలని సూచించారు. అనంతరం దాత బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ చేతులు మీదుగా బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

తాడికొండ: చంద్రయాన్–3 విజయవంతంతో భారతీయ శాస్త్రవేత్తలు దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ పటంలో ఎగరేశారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. చంద్రయాన్ విజయవంతమైన సందర్భంగా తాడికొండ అడ్డరోడ్డులోని మార్గదర్శి పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశం కీర్తి ప్రతిష్టలు చంద్రయాన్–3తో మరింత పెరిగాయని, ఇందుకు ప్రధాన కారణమైన ఇస్రో శాస్త్రవేత్తలకు దేశ ప్రజల తరుపున అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. చంద్రయాన్–2 విఫలం తరువాత ఫలించిన చంద్రయాన్–3 ఎవరూ చేయలేని సాహసం అని, దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అవడం భారతదేశ కీర్తిని ప్రపంచ పటంలో తారాస్థాయిలో నిలబెట్టిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గోపిదేశి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిబత్తుల సుబ్బారెడ్డి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లపై కేసులు నమోదు

పట్నంబజారు : 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన వేళా పాళా లేదు.. ప్రాణాలంటే లెక్కలేదు కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వాహనాలపై కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్లు మూడు, డ్రైవింగ్ లైసెన్సు లేనివి ఎనిమిది, పర్మిట్ లేకుండా తిరుగుతున్నవి రెండు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఒకటి, పన్ను చెల్లించకుండా తిరుగుతున్నవి ఒకటి, ఇన్స్యూరెన్సు లేకుండా మూడు వాహనాలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రాక్టర్లు, రిఫ్లెక్టర్ లేకుండా తిరుగుతున్న రెండు వాహనాలు కలిపి మొత్తం 16 ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు.